క్లుప్తంగా

దళారులకు ధాన్యం విక్రయించవద్దు

కందుకూరు: దళారులకు ధాన్యం విక్రయించవద్దని, ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఏ గ్రేడ్ సన్నరకం ధాన్యం క్వింటాకు రూ.2320కి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రూ.500లు కలిపి రూ.2820 చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. కామన్ గ్రేడ్ ధాన్యం క్వింటాకు రూ.2300 చొప్పున కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు.

సర్వేకు ఉపాధ్యాయులు గైర్హాజరు

చర్యలు తీసుకోవాలంటూ
కలెక్టర్‌కు బీఎస్పీ నేతల ఫిర్యాదు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీహరి

మహేశ్వరం: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనని ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి కటికల శ్రీహరి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కులగణలో మండల పరిధి మహేశ్వరం, నందుపల్లి, ఎన్డీతండా, తుమ్మలూరుకు చెందిన పలువురు టీచర్లు కుటుంబ సర్వే చేయడం లేదని ఆరోపించారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్.. విచారణ అనంతరం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు.

మార్కెట్ వైస్ చైర్మన్‌కు సన్మానం



శ్రీనివాసును సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు: హైదరాబాద్ మార్కెట్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన మండల పరిధి శెట్టిపల్లికి చెందిన కొట్ల శ్రీనివాస్‌ను శుక్రవారం మాజీ సర్పంచ్ గోదాదేవి సత్యం ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో జగన్‌మోహన్, వెంకటేశ్వర్లుగౌడ్, యాదయ్యగౌడ్, నర్సింహగౌడ్ తదితరులు ఉన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం



భిక్ష చేస్తున్న అయ్యప్ప భక్తులు

ఆమనగల్లు: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని అయ్యప్ప కొండపై గురుస్వామి పోలోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, పూజలు చేశారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారణ భక్తులకు అన్నదానం (భిక్ష) చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు కృష్ణ, అశోక్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, గిరిబాబు, గోపి, చెన్నకేశవులు ఉన్నారు.

ఘనంగా గురునానక్ జయంతి



గురునానక్ చిత్రపటానికి పూజ చేస్తున్న సిక్కులు తదితరులు

కడ్తాల్: సిక్కుల మత గురువు గురునానక్ జయంతిని సర్దార్ చరణ్‌సింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, పలువురు నాయకులు గురునానక్ చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గురునానక్ బోధనలు, కీర్తనలు సమాజం మంచి మార్గంలో నడిచేందుకు దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, హన్మానాయక్, బీక్యానాయక్, బీచ్యానాయక్, శంకర్, రాందాస్‌నాయక్, నరేందర్‌సింగ్, శక్రుసింగ్, దేవేందర్‌సింగ్, అర్జున్‌సింగ్, నరేశ్‌సింగ్ ఉన్నారు.



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయం సన్నిధిలో భక్తజనం

ఆలయాల్లో కార్తీక శోభ

- భక్తులతో కిక్కిరిసిపోయిన శివగంగ రాజరాజేశ్వరాలయం

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల పరిసరాలు శివనామ స్మరణతో మారుమోగాయి. ఈ సందర్భంగా భక్తులు తెల్లవారు జామున 3 గంటల నుంచి ఆలయాలకు బారులు తీరారు. శివుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ప్రత్యేక దీపారాధన, అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్రపుష్పం, పంచామృతాభిషేకం చేశారు. మహేశ్వరం శివగంగ రాజరాజేశ్వర ఆలయం చుట్టూ ఉన్న పదహారు శివాలయాలతో పాటు మధ్యలో ఉన్న పెద్ద శివాలయంలో మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు

– సాక్షి, నెట్‌వర్క్



మహేశ్వరం: శివగంగ సన్నిధిలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



మహేశ్వరం: గంగలో దీపం వదులుతున్న భక్తురాలు



మహేశ్వరం: రాజరాజేశ్వర ఆలయం గర్భగుడిలో

అతివలు ఆర్థికాభివృద్ధి చెందాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం లింగారెడ్డిగూడ గ్రామ శివారు ఎఫ్‌సీఎస్ అనాథాశ్రమంలో 130 మంది నిరుపేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద మహిళల అభ్యున్నతి కోసం ఎఫ్‌సీఎస్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయమన్నారు. అతివలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా బలపడాలని పేర్కొన్నారు. ఫౌండేషన్ అందజేసిన కుట్టుమిషన్లను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం కూడా మహిళల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్యయాదవ్, విశ్వం, చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, గోవర్ధన్‌గౌడ్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీం, ముబారక్, ప్రభాకర్, శేఖర్, అశోక్ ఫౌండేషన్ నిర్వాహకులు థామస్, గీత తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలను వినియోగించుకోవాలి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మండల పరిధిలోని కొత్తపేట, కేశంపేట, తొమ్మిదిరేకుల గ్రామాల్లో, ప్రాథమిక వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్, నాయకులు విశాల శ్రావణ్‌రెడ్డి, వీరేష్, జగదీశ్వర్, యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, అంజిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్



డ్రైనేజీ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న నాయకులు

డ్రైనేజీ లైన్‌ను తొర్రూర్ వరకు పొడిగించాలి

సీపీఎం నాయకులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడ 22వ వార్డులో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ సుందరయ్యనగర్ వరకే కాకుండా.. మరింత విస్తరణ పెంచి, తొర్రూర్ రోడ్డు వరకు పొడిగించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం మురుగు కాలువ నిర్మాణ పనులను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇప్పటికే కమ్మగూడలోని హైకోర్టు కాలనీ, ప్రగతి నగర్, ఆర్టీసీ కాలనీ, మస్కతి డైరీ పరిసర కాలనీల నుంచి వెలువడే మురుగును సుందరయ్య కాలనీ సమీపంలో వదులుతున్నారని తెలిపారు. దీంతో భారీగా మురుగు నిలిచి ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, విషజ్వరాలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. దానికి తోడు కొత్తగా నిర్మించే డ్రైనేజీ ద్వారా వచ్చే మురుగును కూడా.. ఇక్కడే డంప్ చేస్తే ఇక్కడి ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి.. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రైనేజీ లైన్‌ను తొర్రూర్ వరకు వేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జోన్ బాధ్యుడు మండల సత్యనారాయణ, మున్సిపల్ కమిటీ సభ్యుడు ఇ.భాస్కర్, నాయకులు శ్రీనివాసులు, కృష్ణ, శంకరయ్య, సత్యం, అంజనేయులు, మాల్యాద్రి పాల్గొన్నారు.

మసకబారిన ‘సుందరీకరణ’

అంధకారంలో పెద్దచెరువు!

- కట్టపై వెలగని విద్యుత్ దీపాలు
- ఇబ్బంది పడుతున్న వాకర్స్, వాహనదారులు

మీర్‌పేట: చెరువుల సుందరీకరణలో భాగంగా మీర్‌పేట కార్పొరేషన్ పరిధి పెద్ద చెరువును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్‌ను గతంలోనే నిర్మించారు. కట్టపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. దీంతో ఉదయం, సాయంత్రం వేళలో పరిసర ప్రాంత ప్రజలు వాకింగ్ చేస్తున్నారు. సకుటుంబ సమేతంగా సేదతీరుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. కట్టపై ఉన్న దీపాలు కొద్దిరోజులుగా వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా నడక కొనసాగించే వారు. రాత్రి 7 గంటలు దాటిన తరువాత కట్టపై వాకింగ్ చేయలేని పరిస్థితి నెలకొందని పలువురు పేర్కొంటున్నారు. ఆర్భాటంగా ప్రారంభించిన సెంట్రల్ లైటింగ్స్ కొద్ది రోజులకే వెలగక పోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వలనే అంధకారం నెలకొందని తెలిపారు. చీకట్లో కట్టపై స్పీడ్ బ్రేకర్ కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని ద్విచక్ర వాహనదారులు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

చెరువు కట్టపై విద్యుత్ దీపాలు వెలగక పోవడంతో చెరువు లోపల, కట్ట ప్రాంతాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని వాకర్స్ వెల్లడించారు. దీంతో చీకటి పడితే చెరువు వద్దకు వెళ్లడం మానేశామని పేర్కొంటున్నారు. చీకటిగా ఉండడంతో మందుబాబులు తిష్టవేస్తూ.. భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు

అపరిశుభ్రత

విద్యుత్ దీపాలు వెలగకపోవడం ఎలా ఉన్నా.. చెరువు చుట్టూ చెత్తా చెదారం పేరుకుపోయి, తీవ్ర దుర్వాసన వస్తోందని సమీప ప్రాంత వాసులు తెలిపారు. మున్సిపల్ అధికారులు స్పందించి కట్టపై లైట్లు వెలిగేలా చూడటంతో పాటు చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతున్నారు.



కట్టపై వెలగని సెంట్రల్ లైటింగ్స్

మరమ్మతు చేయిస్తున్నాం



గుర్తు తెలియని వ్యక్తులు కట్టపై చెత్త కుప్పకు నిప్పు పెట్టారు. దీంతో సెంట్రల్ లైటింగ్స్‌కు సంబంధించిన తీగలు (కేబుల్స్) కాలిపోయాయి. వాటిని సరిచేసి మరమ్మతు చేయించాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. మరో రెండు రోజుల్లో లైట్లు యథావిధిగా వెలుగుతాయి.

– ఆర్.జ్ఞానేశ్వర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్

ముమ్మరంగా సమగ్ర సర్వే



ఇబ్రహీంపట్నం: కర్ణంగూడలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వెంకటమ్మ, ఏఈ ఉస్మాన్



యాచారంలో.. ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



తుక్కుగూడలో..

- సెలవురోజు ఇంటింటికీ తిరిగిన ఎన్యుమరేటర్లు
- సర్వే ప్రక్రియను పరిశీలించిన అధికారులు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ప్రశాంతంగా కొనసాగుతోంది. శుక్రవారం సెలవురోజు అయినప్పటికీ.. మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాలు పనిచేశాయి. ఎన్యుమరేటర్లు సర్వే ప్రక్రియను కొనసాగించారు. ఇంటింటికీ తిరిగి కుటుంబీకుల వివరాలను సేకరించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధి కర్ణంగూడ, చర్లపటేల్‌గూడ గ్రామాల్లో ఎంపీడీఓ వెంకటమ్మ, మండల ఏఈ ఉస్మాన్ సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్లకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రవీంద్రసాగర్ మాట్లాడుతూ.. ఈ నెల 23వ తేదీ లోపు కుటుంబ సర్వేను పూర్తిచేస్తామని వెల్లడించారు. అనంతరం ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు.

యాచారంలో..

యాచారం: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రశాంతంగా కొనసాగుతోంది. యాచారం, నందివనపర్తి గ్రామాల్లో ఎన్యుమరేటర్లు సర్వే ప్రక్రియ కొనసాగించారు. ఇంటింటికీ తిరిగి కుటుంబీకుల వివరాలను సేకరించారు. సర్వేను ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి పరిశీలించారు. ప్రజలు తెలిపే సమాచారాన్ని తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులగణకు ప్రజలు సహకరించి, సమాచారం ఇవ్వాలని కోరారు. సర్వే వలన ప్రజలందరికీ మేలు జరుగుతుందని, భవిష్యత్తులో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ముమ్మరంగా కొనసాగుతోంది. శుక్రవారం పురపరిధిలో ఎన్యుమరేటర్లు సర్వే ప్రక్రియను కొనసాగించారు. ఇంటింటికీ తిరిగి కుటుంబీకుల వివరాలను సేకరించారు. సర్వేను మున్సిపల్ కమిషనర్ వాణి పరిశీలించారు. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధ్యం

కడ్తాల్: కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ అన్నారు. ఇందుకు ఉదాహరణ శ్రీరాములేనని పేర్కొన్నారు. ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన శ్రీరాములును ఆయన శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జంగయ్య, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ, నాయకులు లక్ష్మణ్‌చారి, వెంకటేశ్, అంజి, మోతీలాల్, కర్ణాకర్, రాజు, శ్రీనివాస్, పాండు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అకౌంటెంట్‌గా మహేశ్ యాదవ్

కడ్తాల్: నిరుపేద విద్యార్థి మహేశ్ యాదవ్ తాజాగా వెలువడిన గ్రూపు–4 ఫలితాల్లో సత్తాచాటారు. 5700 ర్యాంకు సాధించి మున్సిపల్ శాఖలో అకౌంటెంట్‌గా ఉద్యోగం సాధించాడు. మండల పరిధి రావిచేడ్ గ్రామానికి చెందిన పసుల బాలరాజ్ యాదవ్– బాలమణి దంపతుల కుమారుడైన మహేశ్.. చిననాటి నుంచి చదువులో మేటి అని తల్లిదండ్రులు, గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మిత్రులు, కుటుంబీకులు యువకుడిని అభినందించారు.

కాంగ్రెస్ పాలనలో పేదలకు అన్యాయం

సహకార సంఘం మాజీ చైర్మన్ రాజావరప్రసాద్

షాద్‌నగర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలను మోసం చేస్తుందని రాష్ట్ర సహకార సంఘం మాజీ చైర్మన్ రాజావరప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో ఏ ఒక్క శాఖ కూడా సక్రమంగా పని చేయడం లేదన్నారు. ఆరుగాలం కష్టపడి రైతులు పంటలు పండిస్తే.. కాంగ్రెస్ పాలనలో వారు దోపిడీకి గురవుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టుల నిర్మాణానికి, పరిశ్రమల ఏర్పాటుకు భూములు సేకరిస్తుంటే డీటేల్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్) లేకుండా ఎలా భూములు సేకరిస్తారని ప్రశ్నించిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడేం చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కడుపు రగిలి ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే.. ప్రతిపక్ష పార్టీల నేతలే డబ్బులు ఇచ్చి ప్రజలను ప్రభుత్వం పైకి ఉసిగొల్పుతున్నారని అనడం సరి కాదని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజావరప్రసాద్

శిథిల భవనం.. వెళ్లాలంటే భయం

- ఎప్పుడు కూలుతుందో తెలియని పశు వైద్యశాల దుస్థితి
- ఆందోళన చెందుతున్న రైతులు, ఉద్యోగులు

షాబాద్: శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాల భవనంతో స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు. మండల పరిధిలోని రేగడిదోస్వాడ పశు వైద్యశాల భవనం పూర్తిగా కూలేందుకు సిద్ధంగా ఉంది. భవనం స్లాబ్ కింది భాగం నుంచి తరచూ సిమెంట్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. దీంతో ఇందులో పనిచేసే ఉద్యోగులు, వైద్యశాలకు వస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. రేగడిదోస్వాడలో 30 ఏళ్ల క్రితం పశు వైద్యశాల భవనాన్ని నిర్మించారు. కాగా పూర్తిగా శిథిలమైన ఈ భవనాన్ని వినియోగించొద్దని ఇంజనీరింగ్ శాఖ అధికారులు గతంలోనే సూచించారు. ప్రత్యామ్నాయ మార్గాలు లేకపోవడంతో ఇందులోనే కొనసాగిస్తున్నారు. కొత్త భవనం నిర్మాణం విషయమై ఆశాఖ ఉన్నతాధికారులు నాలుగైదేళ్లుగా ప్రయత్నిస్తుండగా నిధులు మంజూరు కావడంలేదు. దీంతో విధిలేని పరిస్థితుల్లో ఉద్యోగులు ఈ భవనంలోనే భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలోనే తాము విధి నిర్వహణలో ఉన్న సమయంలోనే పలుమార్లు స్లాబ్ పైభాగం నుంచి సిమెంట్ పెచ్చులూడి పడ్డాయని ఉద్యోగులు భయాందోళన వ్యక్తం చేశారు. శిథిలమైన ఈ భవనం స్థానంలోనే కొత్త భవనం నిర్మాణం కోసం గతంలో ఎంపీపీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసినా ఫలితం లేదు.



రేగడిదోస్వాడలో శిథిలమైన పశు వైద్యశాల భవనం

బిక్కుబిక్కుమంటూ..

పూర్తిగా శిథిలమై.. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో పశువులకు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వస్తున్న రైతులు లోపలికి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. తాము లోపలికి వస్తే ఎక్కడ తమపై సిమెంట్ పెచ్చులూడి పడుతాయోనని ఆందోళన చెందుతున్నారు. కాగా ఈ ఆస్పత్రికి పరిధిలో తాళ్లపల్లి, పోతుగల్, చందనవెళ్లి, హైతాబాద్ సబ్ సెంటర్లు ఉన్నాయి. నిత్యం పశువులకు చికిత్స నిమిత్తం ఐదు వందల మంది వరకు రైతులు తమ పశువులను వైద్యశాలకు తోలుకు వస్తున్నారు.

భక్తిభావం పెంపొందించుకోవాలి



ఆలయ నిర్మాణ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని, తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సేవాగుణం అలవర్చుకోవాలని సూచించారు. శుక్రవారం మండల పరిధి మైసిగండి గ్రామం గుట్టపై దత్తాత్రేయస్వామి ఆలయ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే దంపతులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో భక్తిభావం పెరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు లక్పతినాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, బీక్యానాయక్, భాస్కర్‌రెడ్డి, బీచ్యానాయక్, ప్రభు, రాజేందర్, జవహర్‌లాల్, యాదయ్య, కృష్ణ, సుమన్, మల్లేశ్‌గౌడ్ ఉన్నారు.